ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
1★
ఆదివారం 20 ఏప్రిల్ 2025



ఈనెల 24న జాబ్‌మేళా

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ఈనెల 24న కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు శనివారం ఒకప్రకటనలో తెలిపారు. శ్రీరామ లైఫ్ఇన్సూరెన్స్ కార్పొరేట్ లిమిటెడ్ పెద్దపల్లి సంస్థలో 12 మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ పోస్టులు ఖాళీ ఉన్నాయని, డిగ్రీ లేదా ఎంబిఏ ఉత్తీర్ణత సాధించిన మహిళ, పురుష అభ్యర్థులు 25-30 ఏండ్లలోపు వారు అర్హులని తెలిపారు. వేతనం నెలకు 18,500 రూపాయలు ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 24న ఉదయం 11గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్స్‌లతో కలెక్టరేట్ రూమ్ నంబర్ 225లో పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9652953759, 8985336947 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఆప్రకటనలో తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో కోతలు పెడితే చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

పెద్దపల్లి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరిట కోతలు విధిస్తే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి పౌర సరఫరాల శాఖ కమిషనర్ చౌహన్‌తో కలిసి కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. వానాకాలంలో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, యాసంగిలో 127.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందనిన్నారు. ధాన్యం కొనుగోలు అంశంపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైస్‌మిల్లర్లు తాలు, తరుగు పేరు మీద ఎటువంటి కోతలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీఎస్ఓ రాజేందర్, సివిల్ సప్లయ్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, డీసీఓ శ్రీమాల, వ్యవసాయ శాఖ ఏడీఏ కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

సేవా ధృక్పథం పెంపొందించడమే జీసస్ బోధన



రన్‌ఫర్ జీసెస్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, క్రైస్తవులు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సేవా ధృక్పథం పెంపొందించడమే జీసెస్ బోధన అని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం ఇంటర్ డినామినేషనల్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి చౌరస్తా వరకు నిర్వహించిన రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని, రామగుండం నియోజకవర్గాన్ని రూ.500కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి, నాయిని ఓదెలు, పెద్దెల్లి ప్రకాష్, తాళ్లపల్లి యుగంధర్, అశోక్, కళ్యాణి సింహాచలం, నెలకంటి రాము, మెంటం ఉదయ్‌రాజ్, అల్లి శంకర్, పాస్టర్లు పాల్గొన్నారు.

కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు



- జిల్లాలో రాజీవ్ యువ వికాసంలో 42,640 దరఖాస్తులు
- అత్యధికంగా బీసీల దరఖాస్తులు 28,871
- నేతలపై పెరుగుతున్న ఒత్తిడి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకవచ్చిన రాజీవ్ యువ వికాసం పథకానికి కుప్పలుతెప్పలుగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో లబ్ధిదారులను ఎంపిక చేయడం అధికారులకు కత్తి మీద సాములా మారనున్నది. జిల్లా వ్యాప్తంగా ఆయా కార్పొరేషన్ల పరిధిలో స్వయం ఉపాధి కోసం పెద్ద ఎత్తున నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 14వ తేదీ వరకు ప్రభుత్వం విధించిన గడువు ముగిసే నాటికి మీ సేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో 42,640 దరఖాస్తులు రాగా, ఆఫ్‌లైన్‌లో కూడా కొందరు మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాల్లో అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు పొందేందుకు 9,318 మంది ఎస్సీలు దరఖాస్తు చేసుకున్నారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా 942 మంది ఎస్టీలు, బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు 28,871 మంది, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 825 ఈబీసీలు, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 2,615 మంది మైనార్టీలు, క్రిస్టియన్ కార్పొరేషన్ ద్వారా 69 మంది క్రిస్టియన్లు దరఖాస్తు చేసుకున్నారు.

నేతల చుట్టూ ప్రదక్షిణలు..

రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుదారులు ఆయా కార్పొరేషన్ల ద్వారా లబ్ధి పొందేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. పథకం కింద మంజూరు చేయించాలని గ్రామ, మండల, జిల్లా స్థాయి నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ పథకం కింద లబ్ధిదారుల ఎంపిక జాబితాపై జిల్లా ఇన్‌చార్జీ మంత్రి ఆమోద ముద్ర వేయాల్సి ఉంటుంది.

దాదాపు ఆయా నియోజక వర్గాల ఎమ్మెల్యేలు ఎంపిక చేసిన తుది జాబితా ప్రకారమే యూనిట్లు మంజూరు కానున్నాయి. దీంతో ఎమ్మెల్యేలతో పాటు అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నేతలపై తీవ్రంగా ఒత్తిడి పెరగుతున్నది. ప్రభుత్వం జిల్లాలకు లక్ష్యాలు విధించక పోవడంతో ఎంత మందికి లబ్ధి చేకూర్చేలా యూనిట్లు మంజూరు చేస్తుందనే విషయం తెలియడం లేదు. ఒకటి, రెండు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండడంతో తమను ఆశ్రయించిన వారిందరికీ పథకం మంజూరు చేయించాల్సిన అవసరం ఏర్పడింది. తాము ప్రతి పాదించిన వారికి యూనిట్లు మంజూరు కాకుంటే తమ పరిస్థితి ఏమిటనే ఆలోచనలో పడ్డారు. అలాగే లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయడం కత్తిమీద సాములా మారనున్నది.

నాలుగు కేటగిరీల ద్వారా యూనిట్లు మంజూరు

రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకు గాను నాలుగు కేటగిరీల్లో ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించింది. 50 వేల రూపాయల వరకు గల యూనిట్‌కు 100 శాతం సబ్సిడీ, లక్ష రూపాయల వరకు గల యూనిట్‌కు 90 శాతం సబ్సిడీ, 2 లక్షల రూపాయల వరకు గల యూనిట్‌కు 80 శాతం, 4 లక్షల రూపాయల వరకు గల యూనిట్లకు 70 శాతం సబ్సిడీ అందజేయనున్నారు. చాలా మంది 2 లక్షల నుంచి 4 లక్షల రూపాయల వరకు గల యూనిట్లకు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ మండల, మున్సిపల్ అధికారులు కార్పొరేషన్లు, కేటగిరీల వారీగా వేరు చేస్తున్నారు. వాటన్నింటినీ వేరు చేసిన తర్వాత ఈ నెలాఖరు వరకు అర్హులను గుర్తించాల్సి ఉంటుంది.

మే 15 వరకు ఎంపిక చేసిన లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ పోనూ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సమైన జూన్ 2వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా రాజీవ్ యువ వికాసం పథకం కింద ఎంపిక చేసిన లబ్ధి దారులందరికీ మంజూరు పత్రాలు ఇవ్వనున్నారు. అదే రోజున కొన్ని యూనిట్లను గ్రౌండింగ్ చేసి దుకాణాలను ఆరంభించనున్నారు.

అన్ని భూములకు భూధార్ కార్డ్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

ధర్మారం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డు లాగానే ప్రతీ భూమికి భూధార్ కార్డు ప్రభుత్వం తీసుకు వస్తుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం మేడారం రైతువేదికలో ఏర్పాటు చేసిన భూ భారతిపై అవగాహన సదస్సులో కొత్త ఆర్ఓఆర్ చట్టంపై ప్రజలకు వివరించారు. ధరణి పోర్టల్‌లో లేని పలు అంశాలు భూ భారతిలో ప్రభుత్వం పొందు పరచిందని పేర్కొన్నారు. భూ భారతిలోని రికార్డుల్లో తప్పుల సవరణ, భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, వారసత్వ భూముల మ్యుటెషన్, సాదా బైనామాల క్రమబద్ధీకరణ, పట్టదారు పాసుబుక్కులు పొందడం వంటి కీలక అంశాలు ప్రజలకు వివరించారు. ప్రజలు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ వారి అనుమానాలను నివృత్తి చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ధరణిలో సమస్యలు పరిష్కారం కాక రైతులు కోర్టు చుట్టూ తిరగాల్సి ఉండేదన్నారు. ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, సామాన్యుడికి న్యాయం జరిగే విధంగా పాలనను రూపొందిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు పునాది లేవల్ వరకు పూర్తయిన బంజేరుపల్లి గ్రామానికి చెందిన పులిపాక మల్లమ్మకు లక్ష రూపాయల చెక్కును అందజేశారు. అదనపు కలెక్టర్ వేణు, ఆర్డీఓ బొద్దుల గంగయ్య, తహసీల్దార్ ఎండీ వకీల్, ఆర్.ఐలు వరలక్ష్మి, నవీన్, ఏఎంసీ చైర్మెన్ లావుడ్య రూప్లా నాయక్, వైస్ చైర్మెన్ అరిగె లింగయ్య, నాయకులు కొడారి హన్మయ్య, కాడే సూర్యనారాయణ బొల్లి స్వామి, దేవి జనార్దన్, కొత్త నర్సింహులు, కాంపెల్లి రాజేశం పాల్గొన్నారు.

సాగు నీరు విడుదల చేయాలని ఆందోళన

జూలపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సాగునీరు అందించి పంటలను కాపాడాలని శనివారం బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ పంట చేతికందే సమయంలో సాగునీటిని నిలిపి వేయడంతో పంటలు ఎండిపోయే పరిస్థితులు ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రైతులకు సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ స్వర్ణకు వినతిపత్రం అందజేసారు. వెంకటేశం, తొగరి శ్రీనివాస్, వేల్పుల గట్టయ్య, పెద్దోల్ల ఐలయ్య, దొడ్ల రాజయ్య, లక్ష్మన్, బండి రాజయ్య, కనుకయ్య, పాల్గొన్నారు.

కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు



ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) గింజ కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్పష్టం చేశారు. శనివారం వ్యవసాయ మార్కెట్ ఆవరణతోపాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా సన్న వడ్లకు 1,234 కోట్ల రూపాయల బోనస్ చెల్లిస్తే పెద్దపల్లి నియోజకవర్గంలో 59 కోట్ల 63 లక్షల రూపాయలు చెల్లించినట్లు తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా సన్నవడ్లు పండించి ఎక్కువ బోనస్ పెద్దపల్లి నియోజకవర్గ రైతులకు దక్కిందన్నారు. యాసంగిలో కూడా సన్నవడ్లకు 5 వందల రూపాయల బోనస్ చెల్లిస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారన్నారు. క్వింటాల్ సీడ్ ధాన్యానికి రూ.2 వేల నుంచి 5 వేల వరకు ఎక్కువ ధర యాజమాన్యాలు చెల్లిస్తున్నారన్నారు. సీడ్ సాగు చేసిన రైతుల పంటలు ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతింటే ఎకరాకు రూ.20 వేల నష్టపరిహారం చెల్లిస్తామని సీడ్ కంపెనీల యాజమాన్యాలు రైతులకు బాండ్ పేపర్లు రాసిచ్చారన్నారు. రైతులకు మేలు చేస్తుంటే ఓర్వలేకనే ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. రైతులు కొనుగోలు కేంద్రా లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, వైస్‌చైర్మన్ కూర మల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు నర్సింహ రెడ్డి, సంపత్, విండో కార్యదర్శులు మధు, గడ్డి తిరుపతి, డైరెక్టర్లు, అధికారులు, మాజీ జడ్పీటీసీ రామ్మూర్తి, నాయకులు రాజేందర్, నూగిల్ల మల్లయ్య, అరే సంతోష్, ప్రదీప్, సుమన్ రెడ్డి, శ్రీనివాస్, మహేందర్, పాల్గొన్నారు.

సన్నబియ్యాన్ని వినియోగించుకోవాలి



లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా అందిస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం అడ్డగుంటపల్లి ఎస్‌సీ కాలనీలో లబ్ధిదారుని ఇంట్లో భోజనం చేశారు. వారు మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీతో ప్రజల్లో మంచి స్పందన వస్తుందని, ప్రతీ నెల నాణ్యమైన సన్న బియ్యాన్ని అందిస్తామన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని, ఇప్పటికే ప్రభుత్వం మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలీండర్ సరఫరా చేస్తోందని, రాష్ట్రంలో 60వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. తహసీల్దార్ ఈశ్వర్, నాయకులు రాజేష్, మహంకాళి స్వామి, లింగస్వామి, పాతిపెల్లి ఎల్లయ్య, నాయిని ఓదెలు, బాల రాజ్‌కుమార్, దాసరి సాంబమూర్తి పాల్గొన్నారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్‌పై ఆశలు

- టన్ను బొగ్గుపై రూ.20 కార్పస్ ఫండ్ ఇచ్చేందుకు సింగరేణి అంగీకారం
- పార్లమెంట్‌లో గళమెత్తిన ఎంపీ వంశీకృష్ణ

పెద్దపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): చాలీచాలని పింఛన్‌తో బతుకులీడుస్తున్న సింగరేణి కార్మికుల్లో పింఛన్ పెంపుపై ఆశలు చిగురిస్తున్నాయి. పింఛన్ పెరిగే విధంగా సింగరేణి సంస్థ టన్ను బొగ్గు ఉత్పత్తిపై 20 రూపాయల చొప్పున కోల్ మైన్స్ పెన్షన్ స్కీమ్ ట్రస్టు బోర్డుకు జమ చేస్తామని ప్రకటించింది. యేటా 140 కోట్ల రూపాయలు జమ కానున్నాయని అంచనా వేస్తున్నారు. ఈ నిధితో పదవీ విరమణ పొందనున్న సింగరేణి కార్మికులకు ప్రస్తుతం అందుతున్న పింఛన్ పెరిగే అవకాశాలున్నాయి. కేంద్ర, రాష్ట్ర పరిధిలో ప్రభుత్వ ఉద్యోగులకు నెల నెలా ఇచ్చే వేతనాల నుంచి ప్రావిడెంట్ ఫండ్ కింద పే స్కేల్‌ను బట్టి జమ చేస్తుంటారు. పదవీ విరమణ అనంతరం జమ చేసిన పీఎఫ్‌తోపాటు ఆ ఉద్యోగికి వేతనంలో సగం సొమ్ము పింఛన్ కింద అందజేస్తారు. పీఆర్సీ పెరిగినప్పుడు, డీఏలు పెరిగిన సమయంలో కూడా (మిగతా 4వ పేజీలో)

విద్యుత్ సరఫరాలో అంతరాయం

- ఖని జనరల్ ఆసుపత్రిలో తల్లడిల్లిన నవజాత శిశువులు - ఆపరేషన్ థియేటర్‌లో ఇబ్బందులు
- డీజిల్‌కు డబ్బులు లేవంటూ చేతులెత్తేసిన ఆర్ఎంవో

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శనివారం ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో నవజాత శిశువు కేంద్రంలో వెంటిలేటర్‌పై ఉన్న శిశువుతో పాటు ఆపరేషన్ కోసం వెళ్లిన రోగులు ఆపరేషన్ థియేటర్‌లో నరకయాతన పడ్డారు. సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా పట్టణంలో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికీ ఆసుపత్రి సిబ్బంది ఎలాంటి ఏర్పాట్లు చేసుకోకుండానే ఆపరేషన్ థియేటర్‌లోకి రోగులను తీసుకెళ్లారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో వైద్యులు ఆపరేషన్లను నిలిపివేశారు. నవజాత శిశువు కేంద్రంలో ఫోటోథెరపీ కిరణాల్లో ఉండే శిశువులు ఇబ్బంది పడ్డారు. అందులో ఓ శిశువుకు వెంటిలేటర్‌తో వైద్య సేవలు అందిస్తుండగా ఆ శిశువు ఇబ్బందికి గురి కావాల్సి వచ్చింది. ఆసుపత్రిలో జనరేటర్ ఉన్నప్పటికీ అందులో డీజిల్‌కు బడ్జెట్ లేదంటూ ఆర్ఎంవో చేతులెత్తేశారు. ఆసుపత్రిలో పెయిడ్ రూమ్‌ల నుంచి డబ్బులతోపాటు ఇటీవల 2డీ ఎకో నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఆసుపత్రి సిబ్బంది ఆ నిధులు ఎక్కడ వెచ్చిస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ఆసుపత్రి నిర్వహణ బాధ్యత చూడాల్సిన ఏవో ప్రభుత్వం నుంచి నిధులు వస్తలేవని, మేమేం చేయాలంటూ, డీజిల్‌కు నా జేబులో నుంచి డబ్బులు పెట్టాలా అని దురుసుగా మాట్లాడినట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఐదు గంటలపాటు విద్యుత్ సరఫరా లేక వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులు ఇబ్బందులు పడ్డారు. కొత్త జనరేటర్లు మెయింటనెన్స్ చేయడంలో ఆసుపత్రి వర్గాలు విఫలమయ్యాయని రోగులు ఆరోపిస్తున్నారు.

వేసవిలో అడవుల సంరక్షణకు చర్యలు

- వన్యప్రాణాల దాహార్తికి సాసర్‌పిట్ల ఏర్పాటు
- మంటలు అంటుకోకుండా ఫైర్‌లైన్స్



సాసర్ పిట్లు నింపుతున్న సిబ్బంది

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వేసవిలో వన్యప్రాణులు నీరు దొరకక అల్లాడుతుంటాయి. అలాగే చిన్న పొరపాటుతో అడవిలో మంటలు చెలరేగి చెట్లు ఆహుతవుతాయి. మంటలు అంటుకోకుండా, వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. అటవీ ప్రాంతంలో సాసర్ పిట్లు, ఫైర్‌లైన్స్, చెక్‌డ్యాంలో నీరు నిల్వ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్డువైపు ఉన్న అడవుల్లో ఫైర్‌లైన్స్ తీశారు. జిల్లాలో మంథని, పెద్దపల్లి రెండు ఫారెస్టు రెంజర్లు ఉన్నాయి. మొత్తం 14 మండలాల్లో 10 మండలాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. పెద్దపల్లిలో 9 సాసర్ పిట్లు, మంథని రేంజ్‌లో 15 సాసర్ పిట్లు ఏర్పాటు చేశారు. అడవుల్లో ఉన్న వన్యప్రాణులు తాగు నీటి కోసం గ్రామాలు, పట్టణాలకు రాకుండా ఉండేందుకు సాసర్ పిట్లు ఏర్పాటు చేసి నీరు నింపుతున్నారు. రైతులు వేసిన పంటల నుంచి గడ్డి, పత్తి కట్టెలు, తదితర వ్యర్థాలు తగులబెట్టడం వల్ల ఆ నిప్పులు అడవిలో పడి మంటలు చెలరేగుతున్నాయి, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించి చైతన్య పరుస్తున్నారు.



ఫైర్ లైన్స్ తీస్తున్న సిబ్బంది

బీడీ, సిగరేట్ తాగినప్పుడు ఆర్పి వేయాలని, పంటల నుంచి వెలువడే వేస్టేజీని తగుల బెట్టేటప్పుడు పూర్తిగా చల్లారేలా రైతులు చూడాలని సూచిస్తున్నారు. బీడీలు, సిగరేట్లు కాల్చినప్పుడు ఆర్పి వేయాలని ప్రచారం చేస్తున్నారు. అడవులు తగులబడడం వల్ల మొక్కలు, చెట్లు కాలి పోతాయి. వన్యప్రాణులకు హానీ కలిగే ప్రమాదం ఉంది. రోడ్ల వెంట సిగరేట్లు ఆర్పకుండా పడేయడం వల్ల చెట్ల నుంచి రాలిన ఎండిన ఆకులు అంటు కొని అడవులు తగులబడుతాయని, రోడ్డుకు అడవులకు మధ్య 5 మీటర్ల విస్తీర్ణంలో రోడ్డువెంట ఎండు ఆకులను తొలగిస్తున్నారు. ఇందుకోసం కిలోమీటర్ల ఫైర్ లైన్స్ చేస్తున్నారు. దీంతో మంటలు ఫైర్ లైన్స్ వరకు వెళ్లి అక్కడే ఆగిపోతుంది. అడవుల్లో మంటలు ఏర్పడినప్పుడు చెక్‌డ్యాం నీటితో మంటలు ఆర్పే ఏర్పాటు చేశారు. అడవులు అంటుకున్నప్పుడు సమాచారం రాగానే సిబ్బంది మంటలను ఆర్పివేస్తారు.

ప్రజలు, రైతులు సహకరించాలి: డీఎఫ్‌వో చిక్కుల్ల శివయ్య

అడవులు, వన్యప్రాణుల రక్షణకు ప్రజలు, రైతులు సహకరించాలి. పంటల నుంచి వెలువడే పనికిరాని వ్యర్థాలను కాల్చినప్పుడు రైతులు చల్లారే వరకు అక్కడే ఉండాలి. సిగరేట్ బీడీలు కాల్చినప్పుడు ఆర్పి వేయాలి.

జేఈఈ ఫలితాల్లో 'అల్ఫోర్స్'కు ర్యాంకుల పంట



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఐఐటీ జేఈఈ(మెయిన్స్) 2025 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు వివిధ కేటగిరీల్లో జాతీయస్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం కరీంనగర్ లోని అల్ఫోర్స్ కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్.శరణ్య 49వ ర్యాంకుతో అత్యుత్తమ స్థానంలో నిలువగా, పి శ్రీహర్ష 244 ర్యాంకు, ఎన్ అనిరుద్‌సాయి 272, డి విశాల్ 329, జె వామిక 350, టి ప్రణతి 456, ఇ అంకిత్‌సాయి 574, బి ఆదిత్య 630, టి షివాత్మిక 646, వి హృషికేష్ 703, మహ్మద్ అబ్దుల్ 968, పవార్బాల్, ఆర్ సుమిత్‌కుమార్, డి కార్తిక్‌రెడ్డి, మహ్మద్బుల్షన్, బి విష్ణు ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ కీర్తిని ఇనుమడింపచేశారన్నారు. రానున్న అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించిన విద్యార్థులకు అత్యుత్తమ అధ్యాపక బృందంతో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఐఐటీ, నీట్‌లో అల్ఫోర్స్ విద్యార్థులు రాణించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు ఘనవిజయం సాధించినందుకు అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు జాతీయ స్థాయిలో ప్రభంజనం సృష్టించాయని చైర్మన్ రమేశ్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులను సాధించారన్నారు. ఎం రోహిత్ 17, టి కుందన్ 814, పి ఈశ్వర్‌ముఖేష్, ఎం అంజలి 2575, బి.అక్షర 2992, ఎం.తరుణ్ 5949, జి.నందిని 7464 ర్యాంకుతోపాటు 20వేల లోపు 15 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. జేఈఈ మెయిన్స్‌కు హాజరైనవారిలో 40 శాతం మంది విద్యార్థులు అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్లు చెప్పారు. అనునిత్యం పర్యవేక్షణ, విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపడంతో ఇంతటి ఘనవిజయం సాధించామన్నారు. సంస్థ స్థాపించిన నాటి నుంచి అన్ని పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు రాణిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్‌మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌లు మల్లారెడ్డి, రాధాకృష్ణ, మోహన్‌రావు, ఏజీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విజయకేతనం చూపిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ రమేశ్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు

ట్రినిటి కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ట్రినిటి విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎ రఘుపతి అనే విద్యార్థి జాతీయస్థాయిలో 138వ ర్యాంకు, ఎ హేమంత్ 132, డి సాయిసరణ్‌కుమార్ 313, ఎస్ పరమేశ్వర్‌రెడ్డి 344, ఎ ఫణీందర్ 409, ఆర్ సాయికిషోర్ 587, వి అదీప్ 751, డి మహేశ్ 974, ఆర్ మనోజ్ 1262, బి సిద్దిక 1551 ర్యాంకు సాధించారు. కేవలం ఒకే బ్రాంచి నుంచి 1000లోపు ఎనిమిది ర్యాంకులతో పాటు పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో 83 శాతం మంది విద్యార్థులు జేఈఈ-అడ్వాన్స్ పరీక్షలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా శనివారం కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిష్ణాతులైన అధ్యాపకుల పర్యవేక్షణలో, నిర్దిష్టమైన ప్రణాళిక, ఉన్నతమైన విద్యా బోధనతో ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. అనంతరం చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ ర్యాంకులు సాధించడం ట్రినిటి కళాశాలకే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఆయా బ్రాంచీల ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మానకొండూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన మడ్డి తిరుపతి (50) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. తిరుపతి తన దాబా ఇంటిపై మరో మరో రెండు రూములను నిర్మించేందుకు ఇటుకల గోడను నిర్మిస్తున్నారు. ఈ 12న పనులను పరిశీలించేందుకు ఇంటిపైకి వెళ్లాడు. నూతనంగా నిర్మిస్తున్న గోడను పట్టుకోవడంతో గోడకూలీ కిందపడ్డాడు. తీవ్ర గాయాల పాలైన తిరుపతిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య వనజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోసం చేసిన వ్యక్తి అరెస్టు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : సబ్సిడీ రుణం ఇప్పిస్తానని మోసం చేసిన పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన అమ్ముల అశోక్‌యాదవ్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వల్లంపట్ల గ్రామానికి చెందిన పెంటల మల్లయ్య వద్దకు వెళ్లి ఎస్సీ పేరు మీద ట్రాక్టర్ కొనుగోలు చేస్తే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ ఇప్పిస్తానని నమ్మించి రూ.50వేలు తీసుకున్నాడు. కొద్దిరోజులకు సబ్సిడీ మంజూరు అయినట్లు నకిలీ ప్రొసీడింగ్ కాపీ అందించాడు. వంతడుపుల గ్రామానికి చెందిన బోయిని పర్శరాంకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణం ఇప్పిస్తానని చెప్పి రూ.50వేలు తీసుకొని నకిలీ ప్రొసీడింగ్ కాపీ అందించాడు. పర్శరాం దీనిని తీసుకొని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అడగగా నకిలీదని తేలింది. దీనితో బాధితులు ఫిర్యాదు చేయగా శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పచ్చదనానికి గొడ్డలిపెట్టు

యథేచ్ఛగా హరితహారం చెట్ల నరికివేత

రహదారి వెంట వృక్షాలకు రక్షణ కరువు

చందుర్తి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ఏటా వానాకాలంలో ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీ స్థలాలతో పాటు, ఇళ్లు, పొలాలు, చెరువులు గట్లపై ప్రతిష్ఠాత్మకంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు అట్టహాసంగా చేపడుతున్నారు. అవి పెరిగి పెద్దవి కాగానే విద్యుత్ తీగలకు అడ్డువస్తున్నాయని విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది ఏపుగా పెరిగిన చెట్లను నరికేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. చందుర్తి మండలంలోని మూడపల్లి, మర్రిగడ్డ, లింగంపేట, మల్యాల తదితర గ్రామాల్లో పదేళ్లుగా నాటిన మొక్కలు పెరిగి పెద్దవి కాగా విద్యుత్ అధికారులు తీగలకు అడ్డువస్తున్నాయని, రైతులు తమ పంట పొలాలపై చెట్ల నీడతో పంటలు పండవని చెట్లను మొదళ్ల నుంచి నరికేస్తున్నారు. గతంలో రోడ్లకిరువైపులా ఉపాధిహామి, ఆటవీ శాఖ అధికారులు, గ్రామపంచాయతీలను భాగస్వామ్యం చేస్తూ పెద్దఎత్తున మొక్కలను నాటించారు. ఒక్కొక్క గ్రామాల్లో వేలాది మొక్కలు నాటారు. వాటిలో దాదాపు 80 శాతం మేర ఏపుగా పెరిగాయి. ప్రధాన రోడ్లకిరువైపులా ఇప్పటికే పలుమార్లు చెట్లను నరికేశారు. అయినా అవి పెరుగుతుంటే అధికారులు విద్యుత్ తీగలకు అడ్డువచ్చే చెట్ల కొమ్మలతో పాటు ఇతర చెట్లను సైతం నరికేస్తున్నారు. పలుచోట్ల మొదళ్ల వరకు నరికేసి చేతులు దులుపుకుంటున్నారు.



మూడపల్లిలో బైపాస్ రోడ్డులో నరికిన చెట్లు

చెట్లను నరికివేస్తే చర్యలు తీసుకుంటాం..

రాజయ్య, చందుర్తి ఏపీవో



హరితహారంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను తొలగించినా, చెట్లను నరికివేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. జరిమానాతోపాటు కేసులు కూడా నమోదు చేయిస్తాం. మొక్కలు, చెట్లను నరికి వేయడం, తగలబెట్టడం లాంటి పనులు చేయవద్దు.



మూడపల్లి శివారులో నరికిన హరితహారం చెట్లు

కన్నెత్తి చూడని అధికారులు

గ్రామపంచాయతీల్లో కొన్ని సంవత్సరాల నుంచి పెంచిన హరితహారం చెట్లను యథేచ్ఛగా నరికేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. చెట్లు తిరిగి చిగురించేందుకు వీలు లేకుండా మొదళ్ల వరకు నరికేస్తున్నారు. తీగలకు తగిలే కొమ్మలను తొలగించకుండా మొత్తం చెట్లను నరికి వేస్తుస్తుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టించుకోని అటవీ శాఖ అధికారులు పెద్దఎత్తున రోడ్లకిరువైపుల చెట్లు నరికివేతకు గురవుతున్నప్పటికీ ఉపాధిహామీ అధికారులు కానీ, అటు అటవీ శాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. సొంత ప్లాట్లలో పెరిగిన చెట్లను తొలగించడానికి అనుమతుల పేరుతో ఇబ్బందులకు గురిచేసే అధికారులు ఎంతో ప్రజాధనం వెచ్చించి హరితహారంలో భాగంగా పెంచిన చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా నరికేస్తున్నా కనీస చర్యలు చేపట్టడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి చెట్లు నరికివేతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జేఈఈ ఫలితాల్లో 'ఎస్ఆర్' విద్యార్థుల జయకేతనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఆర్ కళాశాలల జోనల్ ఇన్‌చార్జి నేదురు తిరుపతి

తిమ్మాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌లో ఎస్ఆర్ కళాశాలకు చెందిన విద్యార్థులు జయకేతనం ఎగుర వేసినట్లు కళాశాలల జోనల్ ఇన్‌చార్జి నేదురు తిరుపతి తెలిపారు. మండలంలోని అలుగునూర్‌లోగల ఎస్ఆర్ కళాశాల ఆవరణలో శనివారం మీడియా సమావేశంలో మాట్లా డారు. జేఈఈ మెయిన్స్‌లో తమ కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థులు అర్హత సాధిం చారని తెలిపారు. ఎస్ఆర్ కళాశాలకు చెందిన దాదాపు 185 మందికి పైగా విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌లో విజయం సాధించినట్లు తెలిపారు. వై భరణి శంకర్ జాతీయ స్థాయి లో 88వ ర్యాంకు సాధించగా, బి సురేష్ 98వ ర్యాంకు, ఎ కార్తిక్ 584వ ర్యాంకు, లకావత్ మాధవ్‌చరణ్ 707వ ర్యాంకు, లునావత్ రామ్ చరణ్ 777వ ర్యాంకు, పత్తెం హృషికేష్ 796వ ర్యాంకు సాధించారని వివరించారు. వారితో పాటు మరో ఏడుగురు విద్యార్థులు ఆరువేల లోపు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, కరీంనగర్ డీజీఎం వాసుదేవరెడ్డి, జోనల్ ఇన్‌చార్జి నేదురు తిరుప తిరెడ్డి, ప్రిన్సిపాల్స్‌ను అభినందించారు.

జమ్మికుంట సప్తగిరి ఆసుపత్రి పర్మిషన్ రద్దు

- సీజ్ చేస్తున్నట్లు వైద్యశాఖ నోటీసులు

జమ్మికుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని పాత అంబేద్కర్ చౌరస్తాలో గల సప్తగిరి ఆసుపత్రిలో సీఎంఆర్ఎఫ్ బిల్లుల్లో అక్రమాలు జరిగాయని సీఐడీ అధికారులు నిగ్గు తేల్చారు. దీంతో ఆసుపత్రి అనుమతి రద్దు చేసి, సీజ్ చేస్తున్నట్లు వైద్యారోగ్య శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. అయిన కూడా ఆసుపత్రి నడిపిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు శనివారం ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రి షెటర్ ఎందుకు తీసి పెట్టారని నిర్వాహకులను ప్రశ్నించారు. ఇందులో డెంటల్ ఆసుపత్రి ఉందని, మిగితా వైద్యసేవలు మూసి వేశామన్నారు. అంతేకుండా ఇందులో నుంచి ఇంట్లోకి వెళ్లాల్సిన దారి ఉందని డెంటల్ డాక్టర్ రామకృష్ణ వైద్యాధికారులకు తెలిపారు. మెయిన్ షెటర్ దగ్గరుండి మూసి వేయించారు.

● **ఎనిమిది నెలల క్రితం సీఐడీ విచారణ**

సప్తగిరి ఆసుపత్రిలో సీఎంఆర్ఎఫ్ బిల్లుల అవకతవకలపై సీఐడీ అధికారులు గత ఏడాది సెప్టెంబరు 10వ తేదీన తనిఖీలు చేపట్టారు. రోగులకు చికిత్స చేయకుండా చేసినట్లుగా బిల్లులు సృష్టించిన వ్యవహారంలో వాటికి సంబంధించిన ఆధారాలు సేకరించారు. ఆసుపత్రి డాక్టర్ వంశీని సైతం విచారించారు. తనకు తెలియకుండా ఎవరో బిల్లులు ఇచ్చారని వైద్యుడు వివరణ ఇచ్చాడు. అవకతవకలు జరిగినట్లుగా నిర్ధారించిన సీఐడీ వైద్యారోగ్య శాఖకు నివేదికను అందించింది. ఆ సమయంలోనే సదరు ఆసుపత్రిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. ప్రస్తుతం ఆసుపత్రి రిజిస్ట్రేషన్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

స్వగ్రామానికి చేరిన శ్రీనివాస్ మృతదేహం

- తొమ్మిది రోజుల క్రితం దుబాయ్‌లో హత్య

- దమ్మన్నపేట గ్రామంలో విషాదం





స్వర్గం శ్రీనివాస్ మృతదేహం దగ్గర రోదిస్తున్న కుటుంబసభ్యులు, పాడె మోస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో కొద్దిరోజుల క్రితం పాకిస్తానీ చేతిలో హత్యకు గురైన స్వర్గం శ్రీనివాస్ (43) అనే వ్యక్తి మృతదేహం శనివారం ఆయన స్వగ్రామమైన జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దమ్మన్నపేటకు చేరుకుంది. దీంతో శ్రీనివాస్ భార్య జమున, కొడుకులు చందు, సూర్య, తల్లి రాజవ్వ బోరున విలపించారు. స్వర్గం శ్రీనివాస్ అనే వ్యక్తిని తొమ్మిది రోజుల క్రితం పాకిస్తానీ దారుణంగా నరికి చంపారు. దీంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. దమ్మన్నపేట గ్రామానికి చెందిన స్వర్గం శ్రీనివాస్ కొన్నేళ్ల క్రితం దుబాయ్‌కి వెళ్లి అక్కడ ఓ బేకరిలో పని చేస్తుండేవాడు. పని ఒత్తిడి, మత విద్వేషం కూడా తోడు కావడంతో సహోద్యోగి అయిన పాకిస్తానీ దమ్మన్నపేట గ్రామానికి చెందిన స్వర్గం శ్రీనివాస్, నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రానికి చెందిన అష్టపు ప్రేమ్ సాగర్ అనే ఇద్దరు వ్యక్తులను నరికి చంపాడు. అప్పటి నుంచి శ్రీనివాస్ భార్య, కొడుకులతో పాటు తల్లి స్వర్గం రాజవ్వ మృతదేహం రాకకోసం నిత్యం ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు శ్రీనివాస్ మృతదేహం శనివారం ఇంటికి చేరుకోగా కుటుంబసభ్యులు విలపించారు.

● **అంత్యక్రియల్లో పాల్గొన్న విప్ లక్ష్మణ్‌కుమార్**

స్వర్గం శ్రీనివాస్ మృతదేహానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం నివాళులర్పించారు. గోదావరి నది వద్ద మృతుడి అంత్యక్రియలు నిర్వహించగా అంతిమ యాత్రలో విప్ పాల్గొని పాడె మోసారు. మృతుడి అంత్యక్రియల కోసం రూ.10 వేలు అందించారు. కలెక్టర్ ప్రభుత్వం పక్షాన రూ.15 వేలు అంత్యక్రియల ఖర్చు కోసం అందించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని విప్ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుబాయ్‌లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు హత్యకు గురయ్యారని తెలిసిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి మృతదేహాలను స్వదేశానికి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారన్నారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఎన్ఆర్ఐ పాలసీ కింద రూ.5 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ జాబ్, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతుడి కుటుంబ సభ్యులకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై సీసీఎస్ పోలీసుల దాడి

మేడిపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వకోట గ్రామశివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సీసీఎస్ పోలీసులు శనివారం దాడి చేశారు. పేకాట అడుతున్న ఏడుగురుని అదుపులోకి తీసుకొని వారి వద్దనుంచి రూ. 11,100, ఏడు మొబైల్ ఫోన్స్‌ను సీజ్ చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. పేకాటలో పట్టుబడ్డ వారిని మేడిపల్లి పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేశామని ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు. దాడుల్లో కానిస్టేబుల్ రమేష్, అఫ్రోజ్, కమలాకర్ పాల్గొన్నారు.

గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌లో..

గంగాధర(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్ నగర్‌లో పేకాట ఆడుతున్నవారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వంశీక్రిష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో పేకాడుతున్నారని పక్కా సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 9,600 రూపాయలు స్వాధీనం చేసుకొని నలుగురి పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

చేపల వేటకు వెళ్లి బాలుడి మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలోని కొత్తపల్లి మండలం రేకుర్తి సాలేహ్‌నగర్‌కు చెందిన మహ్మద్ అహిర్ అజ్మన్(11) అనే బాలుడు చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలోపడి మృతి చెందాడు. కొత్తపల్లి పోలీసుల వివరాల ప్రకారం... స్థానిక వెంకటేశ్వర కాలనీ శ్మశానవాటిక సమీపంలో ఉన్న ఒక వ్యవసాయ బావి వద్దకు శనివారం ఉదయం అహిర్ అజ్మన్‌తోపాటు అతడి స్నేహితులు మహ్మద్ అన్సర్, మహ్మద్ అర్మన్ చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలు పడుతున్న సమయంలో అహిర్ అజ్మన్ ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునుగుతుండగా స్నేహితులు కాపాడండి అంటూ కేకలు వేశారు. స్థానికులు వచ్చి కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే నీట మునిగాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది తాళ్లు, ఇతర పరికరాల సహాయంతో అహిర్ అజ్మన్ మృతదేహాన్ని బయటకు తీశారు. అహిర్ అజ్మన్ తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి



అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మల్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముడి ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చిన వ్యక్తికి జరిమానా

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూరు గ్రామానికి చెందిన రంగు శ్రీనివాస్ అధిక వడ్డీలకు అప్పులు ఇస్తుండడంతో కలెక్టర్ జరిమానా విధించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ ఇబ్బంది పెడుతున్నారనే సమాచారం మేరకు గత నవంబరు నెలలో ఇంట్లో తనిఖీలు చేయగా ప్రామిసరీ నోట్లు, డాక్యుమెంట్లు లభించడంతో కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం శనివారం కలెక్టర్ 20 వేల రూపాయల జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

మోటార్ల చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ఓదెల ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఇద్దరు వ్యవసాయ మోటర్ల చోరీ నిందితులను శనివారం అరెస్ట్ చేసినట్లు పొత్కపల్లి ఎస్సై రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీపీ ఫుల్ల కరుణాకర్ నిందితుల వివరాలను వెల్లడించారు. సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలోని ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, జూలపల్లి మండలాల్లో రైతులు బావులు, వాగులు, చెరువులపై సాగునీటి అవసరాలకు అమర్చుకున్న విద్యుత్‌మోటార్లు, సర్వీస్ వైర్లను చోరీకి పాల్పడగా కేసులు నమోదు చేశారు. ఓదెల మండలం శివారు జమ్మికుంటకు వెళ్లే రహదారిలో ఎస్సై దీకొండ రమేష్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా ట్రాలీ వాహనంలో ఓదెల తారకరామ కాలనీ, బుడిగజంగాల వాడకు చెందిన సిరిగిరి ప్రసాద్, అంగిడి సాయికుమార్ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని వాహనాన్ని తనిఖీ చేయగా విద్యుత్ మోటార్లు, సర్వీస్ వైర్లు కనిపించడంతో విచారణ చేపట్టారు. జల్సాలకు అలవాటు పడి వీరిద్దరు పొత్కపల్లి, కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి, సుల్తానాబాద్ పోలీస్ సర్కిల్ పరిధిలోనిలో చోరీలకు పాల్పడ్డారని, ట్రాలీలో తిరుగుతూ, జూలపల్లి మండలం కాచాపూర్‌లో ఆరు మోటార్లు, కోనరావుపేటలో ఒకటి, ఓదెల మండలం కొమిర ఎస్సారెస్పీ కాలువ వద్ద ఆరు మోటార్లు, కొలనూర్ శివారులో ఐదు మోటార్లు, పోత్కపల్లి శానగొండ శివారులో నాలుగు మోటార్లు, అలాగే 17 బావుల వద్ద నుంచి 170 మీటర్ల సర్వీస్ వైరు చోరీ చేశారు. రూపునారాయణపేట మానేరు వాగులోని 23 విద్యుత్ బోర్‌మోటార్లు, ఓదెల శివారులోని ఆరు మోటార్లను ఎత్తుకెళ్లారని తెలిపారు. సిరిగిరి ప్రసాద్ ఇనుప సామాను వ్యాపారం చేస్తూ ఆర్థిక నష్టాలకు గురయ్యాడు. దీంతో సునాయసంగా డబ్బులు సంపాదించేందుకు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులను పోగొట్టుకున్నాడని తెలిపారు. దీంతో ఇదే గ్రామానికి చెందిన అంగడి సాయికుమార్‌తో కలిసి ఇనుప సామాను దొంగిలించే వారని తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.10.67లక్షల విలువ చేసే విద్యుత్ మోటార్లు, 750 మీటర్ల సర్వీస్ వైరును, ఆటో ట్రాలీ, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. దొంగలను పట్టుకున్న ఏఎస్ఐ రత్నాకర్‌తో పాటు 13 మంది పోలీస్ సిబ్బందిని డీసీపీ అభినందించి రివార్డులను అందించారు. ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై దీకొండ రమేష్ పాల్గొన్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న డీసీపీ కరుణాకర్



చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



ఆ లోటును భర్తీ చేస్తుంది

- మోహనకృష్ణ ఇంద్రగంటి

'అష్టాచెమ్మ', 'గోల్కొండ హైస్కూల్', 'సమ్మోహనం' వంటి చిత్రాలతో సెన్సిబుల్ దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు మోహనకృష్ణ ఇంద్రగంటి. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'సారంగపాణి జాతకం'. ప్రియదర్శి, రూప కొడవాయూర్ ప్రధాన పాత్రల్లో నటించారు. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా మోహనకృష్ణ మీడియాతో ముచ్చటించారు. "ఒకప్పటితో పోల్చితో తెలుగులో పూర్తి స్థాయి కామెడీ చిత్రాల సంఖ్య తగ్గిపోయింది. ఆ లోటును భర్తీ చేస్తుందీ చిత్రం. కథానాయకుడి పాత్రకు ఎవరు సరిపోతారా అని వెతికే క్రమంలో, ప్రియదర్శి నటించిన 'బలగం'తో పాటు ఆయన చేసిన మరికొన్ని చిత్రాలు చూశా. ఈ కథకు ఆయనే సరిపోతారనిపించింది. ఇందులో పాత్రలన్నీ కొత్తగా ఉంటాయి. కేవలం థియేటర్లో చూసి ఆనందించడమే కాకుండా.. కొన్ని రోజుల పాటు మాట్లాడుకునేలా ఉంటుందీ సినిమా. అన్ని వర్గాలను మెప్పించే ఈ చిత్రం, కాసేపు మీ కష్టాలన్నింటినీ మర్చిపోయేలా చేస్తుంది. జాతకాలను అతిగా నమ్మే ఓ యువకుడి జీవితంలో జరిగిన ఆసక్తికరమైన సంఘటనలే చిత్రకథాంశం. నమ్మకం మూఢనమ్మకంగా మారి, ఇతరుల్ని ఇబ్బందిపెట్టకూడదనే సందేశాన్ని వినోదాత్మకంగా అందిస్తుంది. సినిమాలో కడుపుబ్బా నవ్వుకునే వినోదంతో పాటు ఓ క్రైమ్ ఎలిమెంట్ ఉంటుంది. అది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడిగా ఈ సినిమా నాకు చాలా సంతృప్తిని ఇచ్చింది. ఇప్పుడు ప్రేక్షకుల అటెన్షన్ స్పాన్ తగ్గిపోయింది. వారు థియేటర్లో మొబైల్ తీయకుండా ఉంచగల స్థాయిలో సినిమాలు తీయడం దర్శకులు నేర్చుకోవాలి" అని చెప్పారు.




ఎన్ని అబద్ధాలు చెప్పినా మా సినిమా గెలుస్తుంది

విజయశాంతి

"'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సినిమాను హిట్ చేసిన ప్రేక్షకులకు పాదాభివందనాలు. క్లైమాక్స్ కోసం కల్యాణ్‌బాబు తీసుకున్న రిస్క్ వల్లే సినిమా ఇంత గొప్పగా వచ్చింది. సినిమాకు నెగెటివ్ ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదు. దుష్ప్రచారం చేసేవారు దయచేసి మైండ్‌సెట్‌ను మార్చుకోండి. వారు సినిమా బాగాలేదని ఎన్ని అబద్ధాలు చెప్పినా, చివరికి మా సినిమానే గెలుస్తుంది. కోట్లు ఖర్చు పెట్టి తీసిన సినిమాను బ్రతకనివ్వండి. మనస్ఫూర్తిగా సినిమాను దీవించడం నేర్చుకోండి" అని నటి విజయశాంతి అన్నారు. కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన ఈ చిత్రం ఇటీవలె విడుదలైంది. సక్సెస్ మీట్‌లో కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ "కమర్షియల్ సినిమాలోనూ కొత్తదనం ఉంటేనే ప్రేక్షకులు ఇష్టపడుతున్నారు. ఈ విషయంలో దర్శకుడు ప్రదీప్ ప్రేక్షకుల అంచనాలను అందుకున్నాడు" అని చెప్పారు.













కాంగ్రెస్ ఉచిత పథకాలతో ఆర్థిక సంక్షోభం

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఉచిత పథకాలతో ఆర్థిక సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎడారిగా చేశారని టీఆర్ఎస్-డీ వ్యవస్థాపక అధ్యక్షుడు నరాల సత్యనారాయణ అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను అడ్డుపెట్టుకుని అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రజలకు చేసిందేమి లేదని, పది సంవత్సరాలు అధికారంలో ఉన్నా ప్రజలు రాతలు మారలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో లక్షల కోట్లను దండుకున్నారని, ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందం చేసుకుని కోట్ల రూపాయలు గడించారని, తెలంగాణ వస్తే నీళ్లు, నిధులు, ఉద్యోగాలు వస్తాయని చెప్పారని, ఆ ఉద్యోగాలు ఎటు పోయాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితబంధు, రైతు భరోసా, కౌలు రైతులకు భరోసా కల్పిస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఏమి ఇవ్వలేదని, తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్ రూ.11లక్షల కోట్లు అని చెబుతున్నారని, ఈ నిధులు ఎక్కడికి వెళుతున్నాయన్నారు. తోడేటి శంకర్‌గౌడ్, రమేష్, ఆసంపల్లి ఆనంద్‌బాబు, పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మంథనిరూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పుట్టపాకలో శ్రీవైద్య ఫౌండేషన్ సహకారంతో శ్రీపాద ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిచారు. పేదల ఆరోగ్య అవసరాలను తీర్చేందుకు గ్రామాల్లో శ్రీపాద ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్‌పై ఆశలు..

(1వ పేజీ తరువాయి)

పింఛన్‌దారులకు పెన్షన్ పెరుగుతుంది. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. సింగరేణి సంస్థలో పని చేసే ఉద్యోగులు, కార్మికులకు నెలనెలా ఇచ్చే వేతనంలో మూల వేతనాన్ని అనుసరించి ప్రావిడెంట్ ఫండ్ చెల్లిస్తున్నారు. వారు పీఎఫ్ కింద ఎంత సొమ్ము చెల్లిస్తారో, అంతే మొత్తంలో సంస్థ కూడా జమ చేస్తుంది. కార్మికులు పదవీ విరమణ పొందిన అనంతరం ప్రావిడెంట్ ఫండ్ అందజేస్తూ వచ్చారు. ఆ తర్వాత వారికి సింగరేణి సంస్థ నుంచి ఎలాంటి పింఛన్లు ఇచ్చే వారు కాదు. పదవీ విరమణ పొందిన అనంతరం సింగరేణి కార్మికులకు పింఛన్ వర్తింపజేయాలని కేంద్ర మాజీ కార్మిక శాఖ మంత్రి గడ్డం వెంకటస్వామి 1995 నుంచి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. బొగ్గు గనుల్లో పని చేస్తున్న కార్మికులు, ఇతర ఉద్యోగులకు కోల్ మైన్స్ పెన్షన్స్ స్కీమ్‌ను వర్తింపజేయాలని 1998లో పార్లమెంట్‌లో చట్టం తీసుక వచ్చారు. దీనిని కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపీఓ) నిర్వహిస్తూ వస్తున్నది. ప్రతీ ఐదేళ్లకోసారి పదవీ విరమణ పొందిన కార్మికులు ఇచ్చే పింఛన్ సొమ్మును పెంచాలని చట్టంలో పేర్కొన్నారు. కానీ ఏనాడు కూడా పింఛన్ పెరిగిన దాఖలాలు లేవు. పథకం అమల్లోకి వచ్చినప్పుడు ఎంతైతే పింఛన్ ఇచ్చారో అంతే పింఛన్ ఇస్తున్నారు.

ఉదాహరణకు సీనియర్ పంప్ ఆపరేటర్‌గా 2006లో పదవీ విరమణ పొందిన కార్మికుడికి రూ. 1,140 పింఛన్ ఇచ్చారు. ఇప్పుడు కూడా అంతే మొత్తంలో పింఛన్ ఇస్తూ వస్తున్నారు. ఒకప్పుడు సింగరేణి సంస్థలో ఆరు లక్షల మంది కార్మికులు పని చేయగా, ప్రస్తుతం అందులో 30 శాతం కూడా కార్మికులు లేరు. ప్రస్తుతం సింగరేణిలో 80 వేల మంది వరకు పింఛన్ పొందుతున్నారు. ఇందులో 15 వేల నుంచి 20 వేల మంది కార్మికులకు నెలకు 1500 రూపాయల పింఛన్ రావడం లేదు. 2010 వరకు సింగరేణి సంస్థలో పని చేసిన కార్మికులకు వేతనాలు తక్కువే. దీంతో నెల నెలా ఇచ్చే పింఛన్ 2 వేలకు దాట లేదు. ఈ మధ్యకాలంలో పదవీ విరమణ పొందుతున్న వారికి రూ.20 వేల వరకు పింఛన్ వస్తున్నది. కోల్ మైన్స్ పెన్షన్స్ స్కీమ్ గురించి చట్టంలో పేర్కొన్న ప్రకారం తమకు ఇచ్చే పింఛన్ సొమ్మును పెంచాలని రిటైర్డ్ కార్మికులు ఎంతగా మొత్తుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. గత ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి ఎంపీగా గెలుపొందిన కాకా వెంకటస్వామి మనువడు గడ్డం వంశీకృష్ణ కోల్ మైన్స్ పెన్షన్స్ స్కీమ్ గురించి పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుక వచ్చారు. దీని ఫలితంగా సింగరేణి సంస్థ యేటా ఉత్పత్తి చేసే బొగ్గుపై టన్నుకు 20 రూపాయల చొప్పున కోల్‌మైన్స్ పెన్షన్స్ స్కీమ్ ప్రావిడెంట్ ఫండ్‌కు జమ చేస్తామని సింగరేణి సంస్థ అంగీకారం తెలుపుతూ లేఖ జారీ చేసింది. సింగరేణి సంస్థ యేటా 70 వేల మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తున్న నేపథ్యంలో యేటా 140 కోట్ల రూపాయల వరకు కార్పస్ ఫండ్ జమ కానున్నది. ఈ ఫండ్‌తో పింఛన్ పెరగనున్నది. దీనిపై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ప్రతీ కార్మికుడికి కనీసం 10 వేల రూపాయలు వచ్చే వరకు పోరాటం చేస్తామన్నారు. సింగరేణి సంస్థ కార్పస్ ఫండ్ ప్రకటించడంతో రిటైర్డ్ కార్మికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఎంపీ వంశీకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గోదావరిఖని, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ పెంపునకు కృషి చేస్తున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ చిత్రపటానికి శనివారం గోదావరిఖని చౌరస్తాలో క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకుడు కామ విజయ్ మాట్లాడుతూ సింగరేణి రిటైర్డ్ కార్మికులకు రూ.10వేలు పెన్షన్ ఇవ్వాలని పార్లమెంట్‌లో మాట్లాడి కార్మికుల పెన్షన్ కోసం ప్రతీ టన్నుకు సింగరేణి యాజమాన్యం రూ.20 సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డుకు చెల్లించడానికి అంగీకరించడం హర్షనీయమన్నారు. రూ.140కోట్ల నిధులు సింగరేణి ట్రస్ట్ బోర్డుకు ఇవ్వనున్నదని, దివంగత కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి ప్రవేశపెట్టిన పెన్షనే ప్రస్తుతం సింగరేణిలో వస్తుందని, దశాబ్దాలు అవుతున్నా పెన్షన్ సవరణ జరుగలేదని, రిటైర్డ్ కార్మికులకు కనీసం రూ.10 వేలు ఇవ్వాలని పార్లమెంట్‌లో గడ్డం వంశీ గళమెత్తారని, దీంతో దిగివచ్చిన సింగరేణి యాజమాన్యం రూ.140కోట్లు కేటాయించిందన్నారు. బొగ్గు గనులశాఖ మంత్రిని కలిసి సింగరేణి రిటైర్డ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరించామని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి సింగరేణి యాజమాన్యానికి లేఖ రాశారన్నారు. నాయకులు రాచకొండ కోటేశ్వర్లు, బోయిని మల్లేష్, తిప్పారపు మధు, నరేందర్‌రెడ్డి, జావిద్, సంపత్, మహేష్, రాకేష్, వినోద్, రవి, మహబూబ్, తిప్పారపు మధు పాల్గొన్నారు.

తూకం పూర్తయిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. కందునూరిపల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతు రైతులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని, కుప్పలకు సంబంధించి సీరియల్ నంబర్ పొందిన తర్వాత ఎప్పుడు తూకం అయినా 48 గంటల్లో డబ్బులు ఖాతాల్లో పడతాయన్నారు. ఈ ఏడాది కూడా ఎలాంటి కటింగ్‌లు ఉండవని స్పష్టం చేశారు. మాజీ ఎంపీటీసీ పన్నాల రాములు, మాజీ సర్పంచ్ తిరుపతి, సొసైటీ సీఈఓ బూరుగు సంతోష్ ఎమ్మెల్యేను సన్మానించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, అమిరిశెట్టి రాజలింగం, చిలుక సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కెపల్లి, మహబూబ్‌పల్లి, నగరంపల్లి, పుట్టపాక, శ్రీరాంనగర్, లక్కెపూర్, మైదుపల్లి, గుమ్నూరు, గాజులపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, డైరెక్టర్లు శనివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డైరెక్టర్లు మాచీడి రాజుగౌడ్, రావికంటి సతీష్, మంథని సురేష్, కొత్త శ్రీనివాస్, గడ్డం పోచం, ప్రభాకర్, ఓదెలు, ప్రకాష్‌రెడ్డి, విజయ్ కుమార్, రాజబాబు, కిషన్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సన్నవడ్లకు రూ.500 బోనస్ ప్రకటించడంతో సీడు వేసిన రైతులకు వరంగా మారిందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడుతూ సీడ్ కంపెనీలు వరి విత్తనాలు ఉచితంగా ఇవ్వడంతోపాటు పంట చేతి కొచ్చే వరకు ఖర్చులు భరిస్తున్నాయని, గతేడాది కంటే రెండు వేల రూపాయలు కంపెనీలు పెంచడంతో రైతులకు లాభం వస్తుందన్నారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, సింగిల్ విండో చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి, గజవెల్లి పురుషోత్తం, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి, తహసీల్దార్ జగదీశ్వర రావు, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, పార్టీ మండల అధ్యక్షుడు సదయ్య, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో షీటీంపై అవగాహన

జూలపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తేలుకుంట కస్తూర్బాగాంధీ విద్యాలయంలో శనివారం విద్యార్థినులకు షీటీంపై ఎస్ఐ లావణ్య అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు, డ్రగ్స్, మహిళల భద్రత, ఎవరైనా పోకిరీలు వేధిస్తే వెంటనే 6303923700 ఫోన్ నంబర్‌కు తెలపాలన్నారు. ఫోన్ చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930 కి సమాచారం అందించాలన్నారు. స్నేహలత, సురేష్, మౌనిక, శ్రీలత, పాల్గొన్నారు.

విద్యుత్ మరమ్మతు

రామగిరి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షం, ఈదురుగాలుల వల్ల ఏర్పడిన విద్యుత్ లైన్ సమస్యలను శనివారం ఏఈ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతు పనులు నిర్వహించారు. నవాబ్‌పేట్‌లో ఎల్‌టిలైన్ పోల్ వంగిపోవడంతో మరమ్మతు పనులు చేపట్టారు.

ప్రజలకు చేరువవుతున్న ప్రజాపాలన ఫలాలు



కన్నాలశాలపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న మనాలిఠాకూర్

పాలకుర్తి,ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజాపాలన ఫలాలు ప్రజలకు చేరువ అవుతున్నాయని మక్కాన్‌సింగ్ సేవసమితి చైర్మెన్ మనాలి ఠాకూర్ అన్నారు. శనివారం కన్నాలశాలపల్లి, కొత్తపల్లి, వేమునూరు తదితర గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పని స్థలాల్లో తాగునీరు, నీడకు టెంట్లు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. మహిళా సాధికారతే లక్ష్యంగా,ఇచ్చిన హామీ లను అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే కుటుంబ డిజి టల్ కార్డులో మహిళను యజమానిగా పేర్కొనడం మహిళల పట్ల కాంగ్రెస్‌కు ఉన్న గౌరవానికి నిదర్శనమన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ నాయకులు

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ కుల వృత్తులను కుటీర పరిశ్రమలుగా గుర్తించి ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతించడంతో ఆయన చిత్రపటానికి విశ్వకర్మలు క్షీరాభిషేకం చేశారు. శనివారం జెండా చౌరస్తాలో విశ్వకర్మ పరిషత్ జిల్లా శాఖ అధ్యక్షుడు గర్రెపల్లి నారాయణస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు శివపల్లి రాజేశం మాట్లాడుతూ ఆధునిక యంత్రాలు రావడం వల్ల లోడ్ సరిపోవడం లేదని, 20 కిలో వాట్స్‌కు పెంచాలని బీఆర్ఎస్ ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 25 హెచ్‌పీ లోడుకు అనుమతి ఇచ్చాడని పేర్కొన్నారు. సీఎంతో పాటు ఎలక్ట్రికల్ రెగ్యులేటరీ కమిషన్, ట్రాన్స్‌కో, జెన్కో ఆయా విభాగాల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. నాయకులు పట్టణ అధ్యక్షుడు రమేష్, నారాయణా చారి, నూతి నందం సంపత్, ముమ్మడి స్వామి, శ్రీధర్, శంకర్, రాజేందర్, సుధాకర్, రాజన్న, చారి, గర్రెపల్లి రాజేశం పాల్గొన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ ధర్నా



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ శనివారం రామగుండం మున్సిపల్ కార్యాలయం ఎదుట వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మళ్ల సత్యం, విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పశ్చిమ బెంగాల్‌లో ముర్షిదాబాద్ జిల్లాలో కొందరు హిందువులపై దాడులు చేస్తూ హత్య చేస్తున్నారని, అల్లర్లకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుని, హిందూ కుటుంబాలకు రక్షణ కల్పించాలని కోరారు. అల్లర్లకు తెరలేపి పోలీసులపై, ప్రజల ఆస్తులను తగులబెడుతూ భయబ్రాంతులకు గురి చేస్తున్నారని, అల్లర్లు జరుగుతున్నా ముఖ్యమంత్రి మమత బెనర్జీ నోరు మెదపడం లేదని, పశ్చిమ బెంగాల్‌లో వెంటనే రాష్ట్రపతి పాలన విధించాలని, ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాలు అల్లర్లపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీ ప్రారంభమై మున్సిపల్ కార్యాలయం వరకు చేరుకుంది. అనంతరం డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. వీహెచ్‌పీ నాయకులు మేడగోని రవీందర్, ముప్పె సంపత్‌యాదవ్, నేరేడుకొమ్మ వెంకటస్వామి, అడిగొప్పుల రాజు, మునిగాల సంపత్, అరవింద్, లింగన్న, మమత, భవాని, తిరుమల, లలిత, స్వప్న, చక్రపాణి, అనురిధ్, మల్లికార్జున్, రాజేష్, శివ, ఓదెలు, కిశోర్, బాలు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

జ్యోతినగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : రామగుండం ఎన్టీపీసీలో నిర్వహిస్తున్న జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు శనివారం సాయంత్రం ముగిశాయి. ఎన్టీపీసీ ప్రాజెక్టు ఫైర్ బిల్డింగ్‌లో సీఐఎస్ఎఫ్ ఫైర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ప్రాజెక్టు ఈడీ చందన్ కుమార్ సామంత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు చేపట్టే చర్యలను ప్రదర్శించారు. ప్రధానంగా ఎన్టీపీసీ ప్లాంటులో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు చేసే ఫైర్ ఫైటింగ్ ప్రదర్శన ఆకట్టుకుంది. ఎన్టీపీసీ ఈడీ ప్రసంగిస్తూ సంస్థ ఆస్తులను కాపాడడంలో సీఐఎస్ఎఫ్ చేస్తున్న కృషిని కొనియాడారు. ఉద్యోగులు, విద్యార్థులు, గృహిణులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు ఈడీ చందన్‌కుమార్ బహుమతులను అందజేశారు. సీఐఎస్ ఎఫ్ సీనియర్ కమాండెంట్ అరవింద్ కుమార్, డిప్యూటీ కమాండెట్లు ఓవికె.శాస్త్రి(ఫైర్), ఆంజనేయ రాజు, పాల్గొన్నారు.

వ్యాపార విస్తరణలో సింగరేణి తొలి అడుగు విజయవంతం



సీఎండీ బలరాంను సన్మానిస్తున్న అధికారులు, కార్మిక నాయకులు

గోదావరిఖని, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇతర రాష్ట్రాల విస్తరణలో తొలి అడుగుగా ఒడిశా రాష్ట్రంలో నైనీ బొగ్గు గనిని విజయవంతంగా ప్రారంభించామని, ఇదే స్ఫూర్తితో ఇతర రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో మరిన్ని గనులు, ఇతర ఖనిజ ఉత్పత్తులను చేపట్టేందుకు సన్నద్ధంగా ఉన్నట్లు సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ తెలిపారు. నైనీ బొగ్గు గని ప్రారంభంతో సింగరేణి ఎక్కడైనా విస్తరించగలదన్న భరోసా, నమ్మకం అందరిలో కలిగిందన్నారు. శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు సీఎండీని సన్మానించారు. సీఎండీ మాట్లాడుతూ తొమ్మిదేళ్ల సుదీర్ఘకాలంలో అనేక మంది మాజీ సింగరేణి అధికారులు కూడా తమ వంతుగా కృషి చేశారన్నారు. జనక్ ప్రసాద్, రాజకుమార్, డైరెక్టర్లు సత్యనారాయణ రావు, ఎల్‌వీ సూర్యనారాయణ రావు, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.



సింగరేణి హైస్కూల్‌లో ఘనంగా శాటిలైట్ టెక్నాలజీ డే



మాట్లాడుతున్న ఉపాధ్యాయురాలు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని సింగరేణి హైస్కూల్ సెక్టార్-2లో శనివారం శాటిలైట్ టెక్నాలజీ డే(ఆర్యభట్ట విజయోత్సవ వేడుకలు) నిర్వహించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆర్యభట్ట కృత్రిమ ఉపగ్రహం ప్రవేశపెట్టి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విజయోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు సాంకేతిక అంతరిక్ష పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు ఆర్యభట్ట ఉపగ్రహం గురించి ఎన్నో విషయాలను తెలిపారు. పాఠశాల ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు స్వర్ణలత, రాధిక, సుజాత, శ్రీలత, రేష్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగరేణి స్కూల్‌కు సీబీఎస్ఈ అనుమతి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 సింగరేణి స్కూల్‌లో సీబీఎస్ఈ బోధనకు అనుమతి లభించింది. ఈమేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ శనివారం ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసింది. ఈవిద్యా సంవత్సరం నుంచి కాలనీలోని సెక్టార్-3 సింగరేణి స్కూల్‌లో సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యా బోధన జరగనున్నది. 1వ నుంచి 8వ తరగతి వరకు ఈవిద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సెలబస్ అమలులోకి రానున్నది. సింగరేణి విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాలు పెంచాలనే ఉద్దేశంతో అనుమతులు కోరుతూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఏడాది క్రితం దరఖాస్తు చేసింది. వారి నిబంధనలకు అనుగుణంగా సెక్టార్-3 పాఠశాలను యాజమాన్యం ఆధునీకరించింది. ల్యాబ్‌లు, మైదానం, అర్హతలు గల బోధనా సిబ్బందిని భర్తీ చేసింది. సీబీఎస్ఈ అధికారుల బృందం సెక్టార్-3 పాఠశాలను ఇటీవల సందర్శించారు. పాఠశాలలో వసతులు, ఇతర సౌకర్యాల ను తనిఖీ చేశారు. సీబీఎస్ఈ విద్యా బోధనతో సింగరేణి పాఠశాలలకు పూర్వ వైభవం రానున్నదని కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేలా సీబీఎస్ఈ అనమతుల కోసం యాజమాన్యం కృషి చేయడంపై కార్మిక సంఘాలు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపాయి.

వాణి పాఠశాలలో సీబీఎస్ సెలబస్ ఏర్పాటుకు వినతి

రామగిరి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యంతో ప్రైవేట్ వ్యక్తులు కొనసాగిస్తున్న వాణి పాఠశాలలో విద్యార్థులకు సీబీఎస్ సెలబస్ ఏర్పాటు చేయాలని శనివారం ఎస్‌సి నేషనల్ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్‌కు బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. సింగరేణి కార్మికుల పిల్లలకు ఫీజులను తగ్గించాల్సిందిగా వినతిలో పేర్కోన్నారు. సిబిఎస్ ఏర్పాటు చేయాలని పాఠశాల ఎదుట ఫ్లెక్సిని ఏర్పాటు చేశారు. మోల్యామూరిశ్రీనివాస్, మెరుగు శ్రీకాంత్, తీగల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో కాంట్రాక్ట్ లెక్చరర్ల సమ్మె

రామగిరి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో కాంట్రాక్ట్ లెక్చరర్లు శనివారం సమ్మెబాట పట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 యూనివర్సిటీల్లో పనిచేసే కాంట్రాక్ట్ అధ్యాపకులు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో సమ్మె చేపట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్ట్ అధ్యాపకుల న్యాయపరమైన డిమాండ్ అని అసెంబ్లీలో మాట్లాడిన ప్రస్తుత మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్కలు ప్రస్తుతం విస్మరించారని ఆవేదనతో పేర్కొన్నారు. తమ డిమాండ్ పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం అయ్యే వరకు సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు.

ఆలయాల్లో పూజలు

కమాన్‌పూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి ఆలయంలో గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పిల్లిపల్లెలోని రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు చేశారు. ఆయనను గౌడసంఘం నాయకులు శాలువాతో సన్మానించారు. మాజీ ఎంపీపీ మల్యాల రాంచందర్‌గౌడ్, సంఘం అధ్యక్షుడు నగునూరి నర్సగౌడ్, వెంగళి రాజయ్యగౌడ్, రంగు సత్యం, మేడగోని విజయ్, నారగోని సతీష్, గట్టు సదయ్య, కామ్మగోని అనిల్ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన వైద్య విద్యార్థులు

కమాన్‌పూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రామగుండం ప్రభుత్వ వైద్యకళాశాల విద్యార్థులు 150మంది వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు ఆదేశాల మేరకు శనివారం పీహెచ్‌సీని సందర్శించారు. పీహెచ్‌సీలో అందించే సేవల గురించి డిప్యూటీ డీఎంహెచ్‌వో రవిసింగ్ వివరించారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే వివిధ రకాల ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. కమ్యూనిటీ మెడిసిన్ ఇంచార్జి హెచ్‌సీడీవో డాక్టర్ శ్రీదేవి అధ్యక్షతన డాక్టర్ అఖిల్ సీనియర్ రెసిడెంట్, జీఆర్ -1ఎంఎస్ డబ్ల్యూ పి.రవీందర్, ఉపమండల వైద్యాధికారి డాక్టర్ రవిసింగ్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సల్మా పాల్గొన్నారు.

జైశ్రీరాం వైభవేష్టి పోస్టర్ ఆవిష్కరణ

మంథని, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మంథని విద్యార్థి యువత కార్యాలయంలో జైశ్రీరాం వైభవేష్టి కార్యక్రమ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. సంస్థ అధ్యక్షుడు కొండేల మారుతి మాట్లాడుతూ.. భక్తులందరి సహకారంతో అక్షయ తృతీయ రోజున జైశ్రీరాం నామాన్ని 11 కోట్ల, 11 లక్షల, 11 వేల, 11 వందల సార్లు లిఖించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి 116 మంది దంపతులచే ఏర్పాటు చేసే కార్యచరణ కమిటీకి భక్తులు సహకరించాలని కోరారు. కొంజెర్ల ఉషారాణిశ్రీకాంత్, కొత్త శ్రీనివాస్, మేడగోని రాజమౌళిగౌడ్, గట్టు నాగన్న, పాల్గొన్నారు.

రైతులకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

మంథని, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులో రైతులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను శనివారం పంపిణీ చేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ధాన్యం అమ్ముకోవటానికి వచ్చిన రైతులకు ఏఎంసీ సెక్రెటరీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఏఎంసీ ఉద్యోగులు నరెడ్ల కిరణ్, నక్క శంకర్, ఆశా వర్కర్ అనురాధలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మంథని, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన పలు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శనివారం పరామర్శించారు. పింగిళి మోహన్‌రెడ్డి, బెజ్జాల సావిత్రి, జవహర్ పద్మ, ఏలకోరు సురేందర్‌రెడ్డి, తోట పుల్లమ్మలు మృతి చెందగా పుట్ట మధు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు మాచీడి రాజుగౌడ్, పుప్పాల తిరుపతి, గొబ్బూరి వంశీ, పాల్గొన్నారు.

కస్తూర్బాగాంధీ పాఠశాల తనిఖీ

ముత్తారం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధనతో విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ పెరుగుతుందని ఎంఈఓ హరిప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. వసతులు, భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. రోజు ఆంగ్ల బోధన విద్యార్థులతో ఇంట్రడక్షన్ కావాలని ఉపాధ్యాయులకు సూచించారు.

న్యాయసేవాధికార ఆధ్వర్యంలో ఉచిత సేవలు



మాట్లాడుతున్న జడ్జి దుర్గం గణేష్

సుల్తానాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉచితంగా న్యాయ సేవలు అందించడమే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమని జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ అన్నారు. రేగడిమద్దికుంట గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి దుర్గం గణేష్ మాట్లాడుతు అన్ని గ్రామాల్లో ప్రజలు ఉచిత న్యాయం అందించడానికి పని చేస్తున్నామని, ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి భూమయ్య, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నేరెళ్ళ శంకరయ్య, ఎస్ఐ శ్రావణ్ కుమార్, లోక్‌అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

ఖని బ్రిలియంట్ స్కూల్‌కు అనుమతులు లేవు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీలోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌కు ఎలాంటి అనుమతులు లేవని రామగుండం ఎంఈఓ గడ్డం చంద్రయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు లేని ఈ పాఠశాలలో తల్లిదండ్రులు వారి పిల్లలను చేర్పించవద్దన్నారు.

మాజీ ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డికి నివాళి

పెద్దపల్లి ఎప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు స్వర్గీయ గీట్ల ముకుంద రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే విజయ రమణారావు నివాళులర్పించారు. పెద్దపల్లి అభివృద్ధికి ఎమ్మెల్యేగా ముకుంద రెడ్డి చేసిన సేవలను గుర్తు చేశారు. మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, విండో చైర్మన్ నరసింహ రెడ్డి, నూగిల్ల మల్లయ్య, ఎడెల్లి శంకర్, మస్రత్, బొడ్డుపల్లి శ్రీనివాస్, సంపత్, పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. సతీష్‌బాబు, మహేందర్, రమేష్, పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. గీట్ల అభిమానులు పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రశాంత్‌రావు జన్మదినం పురస్కరించుకుని మీ నేస్తం స్వచ్ఛంద సంస్థ యాచకులకు అన్నదానం చేశారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

గోదావరిఖని, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సూచించారు. శనివారం పాలకుర్తి, అంతర్గాం మండలాల కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు.